క్లుప్తంగా

'తల్లికి వందనం' వర్తింపజేయండి



తల్లికి వందనంలో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్న కౌసర్

రాయదుర్గంటౌన్: అన్ని రకాలుగా అర్హత ఉన్నా.. తల్లికి వందనం పథకం వర్తించలేదని రాయదుర్గంలోని 17వ వార్డు గొగ్గిరొట్టిలో నివాసం ఉండే కౌసర్, హుస్సేన్ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ తమ పిల్లలు ఇందిరాగాంధీ మున్సిపల్ స్కూల్‌లో ఇద్దరు కుమారులు, జెడ్పీ హైస్కూల్‌లో కుమార్తె, భావన ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మరొక కుమారుడు చదువుతున్నారన్నారు. మొదటి విడత జాబితా సరిచూసుకోగా, అందరికీ అర్హత ఉన్న ట్లు చూపించిందన్నారు. అయితే డబ్బు జమ కాలేదన్నారు. రెండో విడతలో చివరి కుమారుడు రిహాన్ విద్యాహక్కు చట్టం కింద చదువుతున్నాడని, జాబితాలో రిమార్కు రావడంతో అర్హత కోల్పోయినట్లు తెలిపారు. మిగతా ము గ్గురు పిల్లలకు అయినా తల్లికి వందనం వర్తింపజేసి, న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఆర్డీటీ పరిరక్షణ కోసం నిరసన



నిరసన కారులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి, రాస్తారోకో చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నిరసనకారులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ పేదలకు నిత్యం సేవలు అందిస్తున్న ఆర్డీటీపై ప్రభుత్వం కక్ష సాధింపు సరికాదన్నారు. కూటమి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రెండు నెలల క్రితం వారం రోజుల్లో ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ రెన్యూవల్ అవుతుందని చెప్పారని, ఇప్పటికీ పట్టించుకోలేదన్నారు. దళిత సంఘాల నాయకులు అక్కులప్ప, రమేష్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు షెక్షా, బిక్కి హరి, సురేష్, తిమ్మప్ప, విజయ్ పాల్గొన్నారు.


బీటీపీలో పెరుగుతున్న నీటి మట్టం



బీటీపీకి చేరుకుంటున్న వరదనీరు

గుమ్మఘట్ట: మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతోంది. ఎగువన ఉన్న కర్ణాటకలో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో బీటీపీకి వరదనీరు చేరుతోంది. గురువారం 1,643 అడుగులు కాగా, శుక్రవారం నాటికి 1,645 అడుగులకు చేరుకున్నట్లు జలవనరుల శాఖ ఏఈ హరీష్ తెలిపారు. గురువారం 600 క్యూసెక్కులనీటి ప్రవాహం కాగా, శుక్రవారం 1,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు వస్తున్నట్లు ఆయన తెలిపారు. మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు ఆయన తెలిపారు.


జాతీయస్థాయి శిక్షణలో శెట్టూరు ఉపాధ్యాయుడు



ప్రశంసాపత్రం అందుకుంటున్న శంకర్ గౌడ్

శెట్టూరు: రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్ సీసీఆర్‌టీ కేంద్రంలో 21 రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణలో శెట్టూరు జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు డాక్టర్ కె. శంకర్‌గౌడ్ పాల్గొన్నారు. జాతీయ విద్యావిధానం–2020లో భాగంగా నిర్వహించిన శిక్షణలో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన ఉపాధ్యాయులు ప్రత్యేకంగా నిలిచారు. శిక్షణలో కూచిపూడి నాట్యం, జానపద నృత్యాలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం సీసీఆర్‌టీ చైర్మన్ డా.వినోద్ నారాయణ, డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఉపాధ్యాయుడికి శెట్టూరు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

అస్తవ్యస్తం..డ్రెయినేజీ వ్యవస్థ



కాలువ పూడిపోవడంతో కల్వర్టుపై చేరిన మురుగునీరు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శాంతినగర్ పార్క్ వెనుక వైపు వీధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కచ్చా డ్రైనేజీతోపాటు కల్వర్టు వద్ద డ్రైనేజీ పూర్తిగా పూడిపోయింది. దీంతో మురుగునీరు కల్వర్టు వద్ద రోడ్డుపై పారుతోంది. మురుగులో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అధికారులు నీరు కల్వర్టుపై రాకుండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హెచ్చెల్సీ నీరు.. వరినాట్లు షురూ

- తుంగభద్ర జలాశయం నుంచి విడుదలైన నీరు
- ఊపందుకున్న వరి సాగు పనులు



జోరుగా సాగుతున్న వరినాట్లు



ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద ప్రవహిస్తున్న నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి నీరు విడుదల చేయడంతో అన్నదాతలు ఎక్కువశాతం ఈసారి వరిసాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో నారుకు డిమాండ్ పెరిగింది. ఇప్పటికే బోరు బావుల కింద అమ్మకానికి వేసుకున్న వరినారును ఇతర ప్రాంత రైతులు కొనుగోలు చేసి, తీసుకెళ్తుండడంతో డిమాండ్ పెరిగింది.

తుంగభద్ర ఎగువకాలువ (హెచ్చెల్సీ), వ్యవసాయ బోర్లు, చెరువుల కింద బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలంలోని కొన్ని గ్రామాల్లో సుమారు 50 వేల వరకు మేలురకం వరి సాగు చేస్తున్నారు. తుంగభద్ర జలాశయంలో ఈ ఏడాది కూడా నీటిని ముందుగా హెచ్చెల్సీ విడుదల చేశారు. దీంతో రైతులు వరి సాగుపై దృష్టి పెట్టారు. ఇప్పటికే కణేకల్లు హెచ్చెల్సీ సబ్-డివిజన్ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్నారు. శ్రీధరఘట్ట, శింగానహళ్లి, శ్రీరంగాపురం క్యాంపు, దేవగిరి, లింగదహాళ్, కొలగానహళ్లి, ఉద్దేహాళ్, బ్రహ్మసముద్రం, యర్రగుంట, కణేకల్లు, గొనేహాళ్, అంబాపురం, తుంబిగనూరు, గంగలాపురం తదితర గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు. మార్కెట్‌లో సన్నవరి ధాన్యానికి డిమాండ్ ఉండటంతో అందుకు అనుగుణంగా కొత్త వంగడాలైన ఐఆర్ ఆర్-93, ఎఎస్ఎం 733, ఆర్ఎన్ఆర్ రకాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు.

పెరిగిన ఖర్చులు :

హెచ్చెల్సీ కాలువకు నీరు రావడంతో వరినాట్లు వేసేందుకు డిమాండ్ పెరిగింది. ఎకరాకు రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు ఉంటోంది. గతంలో రూ. 4 వేల నుంచి రూ. 5 వరకు ఉండేది. ఖర్చులు భరించలేక కొన్ని గ్రామాల్లో చాలా మంది విత్తనగొర్రుతో విత్తుతున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ యజమానులు అద్దె రేట్లను పెంచేశారు. ఎకరా టిల్లర్‌కు రూ. 1,100, రోటోవేటర్ గంటకు రూ 1,400, దమ్ము చేయడానికి రూ. 1,900 తీసుకుంటున్నారు. వరి నార్లుకు డిమాండ్ పెరిగింది. సెంటు నారు రూ. 1,700 నుంచి 1,800 వరకు ఉంది. రసాయన ఎరువుల ధరలు కూడా అధికమయ్యాయి. 50 కిలోల కాంప్లెక్స్ రూ. 1,175 గాకా, ఏనుగు మార్కు రూ.1,300, డీఏపీ రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ఉంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులు ఖరీఫ్ కింద వరి సాగు చేయు రైతులు తగిన యజమాన్య పద్ధతులు పాటించాలి. వరినాట్లు వేయడంలో మెలకువలు పాటించాలి. తగిన దూరం పాటించటంతో పాటు కాలిబాటలు తీయాలి. రైతలు విచక్షణారహితంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను వాడరాదు. నత్రజని ఎరువులను తగ్గించాలి.

– సాయికుమార్, వ్యవసాయాధికారి,బొమ్మనహాళ్

వరిపై ఆశలు పెట్టుకున్నాం



ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా ముందస్తుగా తుంగభద్ర జలాశయంలోకి వరద నీరు వచ్చింది. జలాశయం ఎగువ భాగాల్లో కురుస్తున్న వర్షాలకు జలాశయం పూర్తి స్థాయిలో నిండి హెచ్చెల్సీకి ముందస్తుగానే నీరు విడుదల చేశారు. ముందస్తుగా బోర్ల కింద మిరప, వరి నార్లు సాగు చేసుకున్నాం. ప్రస్తుతం ఆయకట్టు కింద వరినాట్లు ప్రారంభించారు.

– చిన్న తిప్పేస్వామి, రైతు కొలగానహళ్లి గ్రామం, బొమ్మనహాళ్ మండలం

సాగుకు సిద్ధమయ్యాం



ఈ ఏడాది వరి సాగుకు ముందుస్తుగా సిద్ధమయ్యాం. తుంగభద్ర జలాశయానికి గేట్లు మరమ్మతు చేయడానికి బోర్డు అధికారులు చర్యలు తీసుకోవడంతో ఈ ఏడాది నవంబర్ చివరి వరకు ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని అధికారులు చెప్పడంతో ముందుస్తుగానే బోర్డు కింద వరి నారు సాగు చేసుకున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ కాలువకు నీటిని విడుదల చేయడంతో వరి నాట్లు వేసుకునేందుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నాం.

– వన్నూరుస్వామి, రైతు ఉద్దేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

కూటమి పాలకులు ఆశ పెట్టి.. నీళ్లు చల్లారు



హనకనహాళ్‌లో సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకుంటున్న నాయకులు

కణేకల్లు: కూటమి పాలకులు ఎన్నికలప్పుడు ఆశ పెట్టి, ఎన్నో పథకాలు అమలు చేస్తామని చెప్పి.. అధికారంలోకొచ్చిన తర్వాత నీళ్లు చల్లారని మహిళలు, నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆడబిడ్డ నిధి' పథకం ద్వారా 18 ఏళ్లున్న తమకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామన్నారు.. నిరుద్యోగులకు రూ.3 వేలు, 50 ఏళ్లున్న వారికి పింఛన్ ఇస్తానన్న చంద్రబాబు.. ఇప్పుడేమో పట్టించుకోవడంలేదన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్.హనుమాపురం, హనకనహాళ్ గ్రామాల్లో 'బాబూ ష్యూరిటీ... మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, ఎంపీటీసీ సుంకన్న, మాజీ ఎంపీటీసీ రమణరెడ్డి, మాజీ సర్పంచు తిమ్మారెడ్డిలు వివిధ కాలనీల్లో పర్యటించారు.

నమ్మి ఓట్లేసి మోసపోయాం..

కూటమి సర్కారు చెప్పిన పథకాలు అందుతున్నాయా? లేదా? అని మహిళలు, నిరుద్యోగులు, వృద్ధులు, రైతులను వైఎస్సార్‌సీపీ నేతలు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు హామీలన్నీ ఉత్తివేనని, తామంతా నమ్మి మోస పోయామని మహిళలు చెప్పారు. ఆడబిడ్డ నిధి అధికారంలో వచ్చి 14 నెలలైనా ఇవ్వకపోవడం బాధగా ఉందని యువతులు అన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలోనూ అన్యాయమే జరుగుతోందని అన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని పలువురు తల్లులు ఆవేదన చెందారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమన, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గుండ్లపల్లి ఎర్రిస్వామి, రామాంజనేయరెడ్డి, పెన్నోబులేసు, బోయ అనిల్, యోగేష్, బోయ నాగన్న, సుంకన్న, చిదానందా, పూజారి రామాంజినేయులు, గలిబే అనికుమార్, నారాయణస్వామి, సంతోష్, రవీంద్రారెడ్డి, సొల్లాపురం భాస్కర్‌రెడ్డి, ఫణింద్రగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, కెంగుట రామిరెడ్డి, వై.హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన



కర్తనపర్తిలో చంద్రబాబు మోసపు పాలనపై ప్రజలకు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి విమర్శించారు. శుక్రవారం కంబదూరు మండలంలోని కర్తనపర్తి, నూతిమడుగు, కళ్యాణదుర్గం మండలం పరిధిలోని చాపిరి, మల్లాపురం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి పాలనపై ప్రజలు తీవ్రంగా వ్యతిరేకతతో ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ అమలు చేసిన పథకాలతోపాటు మరిన్ని పథకాలు అమలు చేస్తామని చెప్పి.. అధికారంలోకొచ్చిన తర్వాత వాటిని గాలికొదిలేస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు, అరెస్టులతో పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, మండల కన్వీనర్లు గోళ్ల సూరి, హనుమంతరాయుడు, వెంకటప్ప, మండల ఉపాధ్యక్షుడు మల్లాపురం మల్లి, చాపిరి సర్పంచులు హనుమంతప్ప, శివ, ఆమర్, పాలవాయి సర్పంచ్ భర్త గోపాల్, ఎంపీటీసీ లింగమూర్తి, నాయకులు పాతలింగ, వన్నూరస్వామి, హనుమంతురాయుడు, భూషప్ప, రాము, నాగేష్, మల్లేష్, రామ్‌మోహన్, అనంద్, రాము, బీమేష్, నీలి శంకర్ప, దాదు, కిరణ్, ఫయాజ్, వెంకటేశులు, నాగేంద్ర, రవి, సూరి, మాదవయ్య, గంగన్న, హనుమక్క, గజ్జి ఎర్రప్ప, కొత్తూరు బోయ నరసింహులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రానైట్ అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోరా..?



నల్లగుట్టలోని గ్రానైట్ రాళ్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



లారీలో ఫ్యాక్టరీకి తరలిస్తున్న పెద్ద బండరాయి

కూడేరు: కొర్రకోడు సమీపాన పీఏబీఆర్ డ్యాం కట్ట పక్కన ఉన్న నల్లగుట్ట కటువ నుంచి అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోరా అని వైఎస్సార్ సీపీ నేతలు మండి పడ్డారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు వడ్డే గంగాధర్, సర్పంచ్ చంద్రశేఖర్, పార్టీ నేతలు వెంకటరామిరెడ్డి, ధనుంజయ యాదవ్, మాజీ డీలర్ వెంకటేష్, దివాకర్, రాజశేఖర్ నల్లగుట్ట నుంచి గ్రానైట్ తరలిస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఇటాచ్‌లతో పెద్ద రాళ్లను పగలగొట్టడాన్ని పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. నల్లగుట్ట పీఏబీఆర్ డ్యాంకు రక్షణ కవచంగా ఉందన్నారు. నల్లగుట్టలో విలువైన గ్రానైట్ రాయి ఉండడంతో ఇతర ప్రాంతానికి చెందిన వ్యాపారి సుమారు రెండు నెలలు నుంచి పెద్ద ఇటాచీలు, జేసీబీలతో గుట్టలోని పెద్ద రాళ్లను పగలగొట్టి రాత్రి పూట రవాణా చేస్తున్నారన్నారు. నల్లగుంటలోని రాళ్లు తరిగిపోతే డ్యాం గట్టు తెగి హంసాయపల్లి నీటి ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అధికార పార్టీ నేతల అండతోనే ఇష్టారాజ్యంగా అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, వ్యాపారి ఇచ్చే మామూళ్లకు తలొగ్గి అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. నల్లగుట్టలోని రాళ్లను తొలగిస్తే డ్యాం కట్ట భద్రత ఉండదన్నారు. నల్లగుట్టలో అక్రమ మైనింగ్ ఆపాలని, లేదంటే ప్రజలతో కలిసి అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.

పాఠశాల ఆవరణలో పీహెచ్‌సీ నిర్మించొద్దు



ఎనుములదొడ్డి హైస్కూల్ ఆవరణలో పచ్చని చెట్లను నేలకూల్చిన దృశ్యం

కుందుర్పి: ఎనుములదొడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పీహెచ్‌సీ నిర్మించొద్దని హైకోర్టు ఉత్తర్వులున్నా.. అధికార పార్టీ నాయకుల అండతో నిర్మాణానికి సిద్ధం కావడం సరికాదని సర్పంచ్ మహదేవమ్మ, పూర్వ విద్యార్థులు అంటున్నారు. పాఠశాల ఆవరణలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నిర్మించొద్దని సర్పంచ్‌తో పాటు పూర్వ విద్యార్థులు, ఆర్డీఓతో పాటు స్థానిక తహసీల్దార్ ఓబుళేసు, హైస్కూల్ హెచ్ఎంకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. పీహెచ్‌సీ నిర్మాణం పేరుతో ఎనుములదొడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలోని పచ్చని చెట్లను టీడీపీ నాయకులు నరికేశారని పూర్వ విద్యార్థులు విజయ్, ఖాదర్‌బాష, సూర్యప్రకాష్, లక్ష్మీకాంత్, వీరమాసి, మహమద్‌ఖాన్ తదితరులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబు పాఠశాలలోని చెట్లను తొలగించేందుకు అనుమతి ఇవ్వడమేమిటని సర్పంచ్ మహదేవమ్మ అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఆరోగ్య కేంద్రం మంజూరైందని, అప్పట్లో టీడీపీ నాయకులు హైకోర్టుకు వెళ్లి అసలు హైస్కూల్ పరిసర ప్రాంతాల్లోనే భవనాలు నిర్మించరాదని హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చారన్నారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలు ఖాతరు చేయకుండా భవన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ మహదేవమ్మ,పూర్వ విద్యార్థులు అన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



రాయదుర్గం నేసేపేటలో సామూహిక వరలక్ష్మీవ్రతం



బెళుగుప్ప తండాలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



బెళుగుప్ప మంజునాథస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం



ఉరవకొండ: అలంకరణలో జగదీశ్వరి అమ్మవారు



బ్రహసముద్రంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించిన దృశ్యం

రాయదుర్గంటౌన్: శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలు, నిష్ఠతో పాటించారు. రాయదుర్గంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. పట్టణంలోని నేసేపేటలో వెలసిన లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయంలోని వరలక్ష్మీదేవి ఆలయంలో మహిళలు పెద్ద ఎత్తున హాజరై వరలక్ష్మీదేవి సామూహిక వ్రత పూజ నిర్వహించారు. అంతకుముందు శ్రీవరలక్ష్మీదేవికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు జరిగాయి. కళ్లిమఠం స్కూల్ సమీపంలో వెలసిన మహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజ మహోత్సవాన్ని నిర్వహించారు.

బొమ్మనహాళ్: శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళా భక్తులు తమ కుటుంబ సభ్యులతో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా మహిళలు తమ గృహాలలో వరలక్ష్మీ ప్రతిమ ఏర్పాటుచేసి పసుపు, కుంకుమ, గాజులు, రవికలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేమకల్లు ఆంజనేయస్వామి, ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి, బొమ్మనహాళ్ దుర్గమ్మ దేవి, గోవిందవాడ కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారు, వెంకరమణస్వామి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతం పూజలు ఘనంగా జరిగాయి.

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని గ్రామాల్లో వరమహాల్మో వ్రతం వేడుకలు సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కుందుర్పి: మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా వివిధ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. కుందుర్పిలోని కుందుర్పిమ్మ ఆలయం, జంబుగుంపల అటవీ ప్రాంతంలోని మారెమ్మ ఆలయం, బెస్తరపల్లి సవారమ్మ, కదరంపల్లి దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

బెళుగుప్ప: మండలంలోని పలు గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాలక్ష్మి, పద్మావతి అమ్మవారి ఆలయాల్లో మహిళలు పూజలు నిర్వహించారు. బెళుగుప్ప తండాలోని మహాలక్ష్మీదేవి ఆలయంలో ఉదయం నుంచి సుప్రభాతసేవ, గణపతిపూజ, ఆంజనేయస్వామి పూజ, అమ్మవారికి అష్టోత్తరపూజ, పంచామృతాభిషేకం, లలిత సహస్ర పారాయణం, సామూహిక వరలక్ష్మీవ్రతం, మహామంగళహారతి ఇచ్చారు. బెళుగుప్పలోని కొల్హాపురి మహాలక్ష్మి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, మంజునాథేశ్వరాలయం, బూదిగుమ్మ పద్మావతి వెంకటరమణస్వామి తదితర ఆలయాల్లోనూ పూజలు జరిగాయి.

జగదీశ్వరి ఆలయంలో వరలక్ష్మీవ్రతం

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డు వద్ద వెలిసన ప్రసిద్ధ జగదీశ్వరీ ఆలయంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, మహామంగళ హారతి, కుంకుమార్చన చేశారు.

వర మహాలక్ష్మి అలంకరణలో ఉద్భవ మహాలక్ష్మి

ఉరవకొండ రూరల్: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో ఉద్భవ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఉద్భవ మహాలక్ష్మి అమ్మవారిని వర మహాలక్ష్మి రూపంలో వివిధ పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు. అర్చకులు బాలాజీ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

కూడేరు: కూడేరులోని కోదండరామాలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. వరలక్ష్మీ వ్రతం విశిష్టతను తెలియజేశారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరలక్ష్మీ విగ్రహాలు, చిత్రపటాలకు శాస్త్రోక్తంగా పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి కేశవ్

వజ్రకరూర్/ఉరవకొండ: వజ్రకరూరు మేజర్ పంచాయతీ పరిధిలోని 10 వార్డు (బొడిసానిపల్లి) లో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శుక్రవారం ఆంజనేయస్వామి, నాగప్రతిష్ఠ, ధ్వజస్తంభ శిఖరం, గ్రామ శిలా ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ప్రముఖ వ్యాపారవేత్త పారా రామన్న జ్ఞాపకార్థం నిర్మించిన ఈఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఉదయం విశేష పూజలు అభిషేకాలు అనంతరం యంత్ర ప్రతిష్ఠ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజ దాతలు పారావిశ్వనాథ్ (చిట్టెన్న) కుటుంబ సభ్యుల అధ్వర్యంలో జరిగింది. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో పాటు శ్రీరామ్‌నగర్ కాలనీని ప్రారంభించారు.

నేత్రపర్వంగా లక్ష్మీ వెంకటేశ్వరుడి గ్రామోత్సవం



ఉరవకొండలో శ్రీవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక 10వ వార్డు భద్రప్ప బావి వద్ద వెలసిన అతి పురాతన లక్ష్మీ వెంకటేశ్వస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం స్వామికి సుప్రభాతసేవ, పుణ్యాహవచన, నవ గ్రహారాధన, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం గాంధీచౌక్ వద్ద ఉన్న కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి శ్రీవారి ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. అలంకరించిన వాహనంపై శ్రీవారు, భూదేవి, శ్రీదేవి సమేతంగా కొలువు తీర్చారు. అనంతరం భారీ బాణాసంచా పేలుస్తూ, కోలాటం, నృత్యప్రదర్శన మధ్య శ్రీవారి గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం శ్రీవారి కల్యాణోత్సవం వైభవంగా జరగనుంది.

ఘనంగా రాఖీ పౌర్ణమి



ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ఉరవకొండ: అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీకగ అయిన రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఉరవకొండ ఈశ్వరీ బ్రహ్మకుమారి విశ్వ విద్యాలయానికి చెందిన బ్రహ్మకుమారి పుష్పలత, వేదక్క ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులకు శుక్రవారం రాఖీలు కట్టారు. ఈసందర్భంగా ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణికు బ్రహ్మకుమారీ రాఖీ కట్టి, స్వీట్లు అందించారు. దీంతో పాటు ఉరవకొండ ఎస్ఐ జనార్దన్‌నాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణతో పాటు అధ్యాపకులు, ఉరవకొండ ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుధాకర్, ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఎన్ఎస్ చౌదరికి బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు రక్షాబంధన్

రాయదుర్గంటౌన్: అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ వేడుక శనివారం జరగనుంది. రక్షా బంధన్ వేడుకల కోసం రాయదుర్గంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు రాఖీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ధరలను బట్టి వివిధ డిజైన్లలో రాఖీలను విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులతో రాఖీ స్టాల్స్ కిటకిటలాడుతున్నాయి.

కూడేరులో తాగునీరు వృథా



కూడేరు ఎస్సీ కాలనీ వద్ద లీకవుతున్న నీరు

కూడేరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వద్ద సర్దార్ చికెన్ సెంటర్ వద్ద పంచాయతీ తాగునీటి పథకం పైపులైన్ దెబ్బతినింది. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. అపరిశుభ్రత నెలకొని, పాదచారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు.

'బీజేపీకి అధికారంలో ఉండే అర్హత లేదు'

రాయదుర్గంటౌన్: ఓట్లు చోరీ చేసిన బీజేపీకి అధికారంలో ఉండే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గౌని ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సైతం ఈసీతో కుమ్మక్కై బీజేపీ చోరీ చేసి, అనేక రాష్ట్రాల్లో అధికారంలోకొచ్చిందన్నారు. సాక్ష్యాధారాలతో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ నిరూపిస్తున్నట్లు చెప్పారు. బెంగళూరు నగరంలోని మహదేవపురలో 6 లక్షల ఓట్లలో లక్షకుపైగా దొంగ ఓట్లు ఉన్నట్లు నిరూపించడమే చోరీకి ఉదాహరణ అన్నారు.